
పెన్ పవర్
10 YEAR ANNIVERSARY 2014 - 2024
తెలంగాణ రౌండప్
గురువారం 23 జనవరి 2025 పేజీలు 8

# కిడ్నీ రాకెట్ ఘటనపై ప్రభుత్వం సీరియస్..
# విచారణకు ప్రత్యేక కమిటీ




**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ లో కలకలం సృష్టించిన అలకనం ద హాస్పిటల్ కిడ్నీ రాకెట్ ఘటనపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఇప్పటికే ఆస్పత్రిని సీజ్ చేసిన ప్రభుత్వం నలుగురు సభ్యులతో ప్రత్యే క కమిటీ వేసింది. ఉస్మానియా మాజీ సూపరిం టెండెంట్ డాక్టర్ నాగేందర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అలకానంద

-2 లో




## ఫుడ్ ప్రాడక్ట్ కంపెనీలపై...
# మేయర్ ఆకస్మిక తనిఖీలు

సూరారంలోని జి.పి ఫుడ్స్, ముత్తు స్వీట్స్ తయారీ కంపెనీలపై మేయర్ గద్వాల విజయలక్ష్మి తనిఖీ..

- కనీస ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకుండా అపరిశుభ్రంగా తయారీ,ప్యాకేజీలపై సీరియస్..
- సూరారం నుండి ఫిర్యాదుల వెల్లువ.. బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి సడెన్ విజిట్..
- నిర్వహకులను నిలదీసిన మేయర్, తినుబండారాలు చెకోడి, మిక్చర్ స్వాధీనం, కంపెనీలు సీజ్..

-2 లో

## నల్గొండ బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతి




- ఈ నెల 28న నల్గొండ క్లాక్ టవర్ సెంటర్‌లో మహాధర్నా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయం
- పోలీసులు అనుమతి నిరాకరించడంతో హైకోర్టుకు బీఆర్ఎస్
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ధర్నాకు అనుమతి

-2 లో

## తెలంగాణ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు..
# ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం



- తెలంగాణ హైకోర్టుకు నలుగురు అడిషనల్ జడ్జిలు
- నలుగురు అదనపు జడ్జిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ
- జస్టిస్ తిరుమల దేవి, జస్టిస్ రేణుక, జస్టిస్ నర్సింగ్ రావు, జస్టిస్ మధుసూదన్ నియామకం
- నలుగురు శుక్రవారం బాధ్యతలు తీసుకునే అవకాశం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ హైకోర్టుకు నలుగురు అదనపు న్యాయమూర్తులు నియమితులయ్యారు. జస్టిస్ తిరుమల దేవి, జస్టిస్ మధుసూధన్ రావు, జస్టిస్ రేణుకా యార, నర్సింగ్ రావులను హైకోర్టు జడ్జిలుగా నియమిస్తూ 2025, జనవరి 22న రాష్ట్రపతి ఆమోదంతో కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమల దేవి వచ్చే ఏడాది జూన్ 1 వరకు.. రేణుకా యార, నర్సింగ్ రావు నందికొండ, మధుసూధన్ రావులు రెండేళ్ల పాటు అదనపు న్యాయమూర్తులుగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

2025 జనవరి 11న జరిగిన భేటీలో నలుగురు జిల్లా కోర్టు జడ్జిలను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించేందుకు సుప్రీంకోర్టు కొలీజియం

-2 లో






# ఫుడ్ ప్రొడక్ట్ కంపెనీలపై... మేయర్ ఆకస్మిక తనిఖీలు

- కనీస ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకుండా అపరిశుభ్రంగా తయారీ,ప్యాకేజీలపై సీరియస్..
- సూరారం నుండి ఫిర్యాదుల వెల్లువ.. బుధవారం ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి సడెన్ విజిట్..
- నిర్వహకులను నిలదీసిన మేయర్, తినుబండారాలు చెకోడి, మిక్చర్ స్వాధీనం, కంపెనీలు సీజ్..

సూరారంలోని జి.పి ఫుడ్స్, ముత్తు స్వీట్స్ తయారీ కంపెనీలపై మేయర్ గద్వాల విజయలక్ష్మి తనిఖీ..






**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 22:**కనీస ప్రమాణాలు పాటించకుండా,అపరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేస్తున్న పలు తిను బండారాలను చూసిన నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు.. కుత్బుల్లాపూర్ సురారం లోనీ జి.పి ఫుడ్స్ కంపెనీ, ముత్తు స్వీట్స్ కంపెనీలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.. నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఫుడ్ ప్రొడక్ట్లపై సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు చేయాలని సూచించారు.. నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..అనుమతి లేకుండా ఇలాంటి తిను బండారాల తయారీ కంపెనీలపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.. ఇకపై హొటల్స్‌తో పాటు ఇలాంటి మ్యాన్ ఫ్యాక్షర్ యూనిట్స్‌ను సైతం తనిఖీలు చేస్తామని అన్నారు.. పలు సామాజిక మాధ్యమాలతో పాటు పలువురి ఫిర్యాదుల మేరకు గాజులరామారం సర్కిల్-26 పరిధి సూరారం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న చెకోడీ, మిక్సర్ తయారీ కేంద్రాలను, ఆమె అధికారులతో కలిసి పర్యవేక్షించారు.. తినుబండారాలు తయారు చేసే విధానాన్ని ఆమె పరిశీలించారు.. ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్వహిస్తుండడంతో మేయర్ గద్వాల విజయలక్ష్మీ నిర్వాహకులను నిలదీశారు.. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించక పోవడమే గాక, తయారీ కేంద్రాలకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేకపోవడం, ఆమె అధికారులపై సీరియస్ అయ్యారు.. ఇటువంటి తినుబండారాల తయారీ కేంద్రాలు బహిరంగంగా నిర్వహిస్తుంటే సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారని అన్నారు.. ఇలాంటి అపరిశుభ్రంగా తయారు చేసిన, చెకోడీలు, మిక్చర్ తిని,పెద్దలు, చిన్నపిల్లలు అనారోగ్యాల పాలవుతారని ఆమె అన్నారు.. తనిఖీలలో బాద్‌షా తయారీ కేంద్రాన్ని వెంటనే సీజ్ చేయించారు. అలాగే మిక్చర్, చెకోడి తయారీ కేంద్రాలను అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. జంట సర్కిళ్ల పరిధిలో ఉన్న అన్ని తినుబండారాల తయారీ కేంద్రాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.. నిబంధ నలకు విరుద్ధంగా నాణ్యత ప్రమాణాలు పాటించని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారు లను మేయర్ ఆదేశించారు. ఈ తనిఖీలలో అదనపు కమిషనర్ (హెల్త్) పంకజ, జంట సర్కిళ్ల ఉప కమిష నర్లు ఎల్.పి. మల్లారెడ్డి, వి. నరసింహ, ఏ.ఎం.వో హెచ్‌లు మమత, కవిత, ఆహార భద్రత ఇన్‌స్పెక్టర్ పవ న్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..









మేయర్ విజయలక్ష్మికి ప్లాస్టిక్ నివారణకై వివరిస్తున్న రవీందర్ ముదిరాజ్..



క్యాన్సర్ కారక ప్లాస్టిక్ మహమ్మారిని నియంత్రించాలని సామాజిక వేత్త, పర్యావరణ పరిరక్షకుడు కోలా రవీందర్ ముదిరాజ్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీకి వినతిపత్రం అందజేశారు.. కుత్బుల్లాపూర్ సూరారం ఫుడ్స్, స్వీట్స్ తయారీ కేంద్రాలను సందర్శించిన మేయర్‌ను రవీందర్ ముదిరాజ్ బుధవారం కలిశారు.. అత్యంత ప్రమాదకరమైన క్యాన్సర్ కారక ప్లాస్టిక్‌ను బ్యాన్ చేసి ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని, పేపర్ ప్లేట్స్, మోదుగు ఆకులు, అరటి,అడవిలో లభించే పలు రకాల ప్రకృతి పరమైనవి వాడుకలోకి తేవాలని, ఆయన సూచించారు.. **పెన్ పవర్ న్యూస్, జీడిమెట్ల, జనవరి 22:**

## కిడ్నీ రాకెట్ ఘటనపై ప్రభుత్వం సీరియస్..

# విచారణకు ప్రత్యేక కమిటీ

- మొదటి పేజి తరువాయి

హాస్పిటల్ ని పరిశీలించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

సరూర్ నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలోని అలకనంద హాస్పిటల్ లో పర్మిషన్లు లేకుండానే కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నారని, ఒక్కో కిడ్నీని రూ. 55 లక్షలకు అమ్ముతున్నారని ఉన్నతాధికారుల తనిఖీల్లో వెల్లడైంది. జనవరి 21న ఆస్పత్రిపై అధికారులు దాడులు చేపట్టడంతో పేషెంట్లను అక్కడే వదిలేసి డాక్టర్లు పరారయ్యారు. అలకనంద మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ సుమంత్ ను సరూర్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసి, పోలీసులను చూసి పరారైన డాక్టర్ల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండా కిడ్నీ మార్పిడి చేస్తున్న ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు వెల్లడించారు. పరారైన వారి కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు డీసీపీ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.

**ఒక్కో కిడ్నీ రూ.55 లక్షలు..**

తమిళనాడుకు చెందిన ప్రైవేట్‌డాక్టర్ పవన్, ప్రదీప్ అనే వ్యక్తిని మధ్యవర్తులుగా పెట్టుకుని ఈ కిడ్నీ దందా కొనసాగించినట్టు అధికారులు గుర్తించారు. రూ. 55 లక్షలకు బేరం కుదుర్చుకుని ఒక్కో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేస్తున్నట్టు సమాచారం. జనవరి 17న నస్రీన్ బాను నుంచి కిడ్నీ సేకరించి.. కిడ్నీ రిసీవర్ కు ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసినట్లు జిల్లా వైద్య అధికారులు గుర్తించారు.

## నల్గొండ బీఆర్ఎస్ రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతి

**హైదరాబాద్ పెన్ పవర్:**నల్గొండ బీఆర్ఎస్ రైతు మహా ధర్నాకు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. తమ మహా ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. ఈ నెల 28న నల్గొండ క్లాక్ టవర్ సెంటర్‌లో రైతు మహాధర్నా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. అయితే పోలీసులు అనుమతులు ఇవ్వలేదు. దీంతో బీఆర్ఎస్ నేతలు మహాధర్నాకు అనుమతులు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం జనవరి 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహాధర్నా కార్యక్రమానికి అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## తెలంగాణ హైకోర్టుకు నలుగురు న్యాయమూర్తులు.. ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

- మొదటి పేజి తరువాయి

ఆమోదం తెలిపింది. జిల్లా జడ్జిల కోటాలో సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుక యారా, సిటీ సివిల్ స్మాల్ కాజెస్ కోర్టు చీఫ్ జడ్జి నందికొండ నర్సింగ్‌రావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఇ.తిరుమలాదేవి, హైకోర్టు రిజిస్ట్రార్ (పరిపాలన) బి.ఆర్.మధుసూదన్‌రావు పేర్లను కేంద్రానికి సిఫారసు చేసింది. కేంద్రం పరిశీలన అనంతరం సుప్రీం కోర్టు కొలిజియం సిఫారసులకు బుధవారం (జనవరి 22) రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. రాష్ట్రపతి ఆమోదంతో ఈ నలుగురని హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది

## ఎవరెన్ని చెప్పినా నమ్మకండి.. అర్హులందరికీ 4 పథకాలు: మంత్రి పొన్నం

**హైదరాబాద్ పెన్ పవర్:**గణతంత్ర దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను లాంఛనంగా ప్రారంభించనుంది. అయితే.. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు స్పష్టంగా విధి విధానాలు రూపకల్పన చేయగా.. రేషన్ కార్డుల గైడ్స్ లైన్స్ విషయంలో గందరగోళం నెలకొంది. ప్రజలు అయోమయానికి గురి అవుతున్నారు. ఈ క్రమంలో రేషన్ కార్డుల జారీపై మంత్రి పొన్నం ప్రభాకర్ క్లారిటీ ఇచ్చారు.


బుధవారం (జనవరి 22) కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్ గ్రామంలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నాలుగు పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న నేపథ్యంలో రకరకాలుగా కొందరు మాట్లాడుతున్నారు.. ఈ సందర్భంగా జాబితాలో మీ పేర్లు లేవని కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారు.. ఎవరు ఎన్ని చెప్పినా నమ్మకండని సూచించారు.

ఎవ్వరు ఆందోళన చెందవద్దని.. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని.. ఈ సారి లిస్టులో పేర్లు రాని వారు మళ్లీ గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని మరోసారి బలంగా చెప్పారు.



# దశాబ్దాలుగా పోలీసుల నుంచి తప్పించుకున్న మావోయిస్టు అగ్రనేత... భార్యతో సెల్ఫీ ప్రాణాలు తీసింది!

- 2008లో భద్రతా బలగాలపై దాడిలో మాస్టర్ మైండ్ చలపతి
- మావోయిస్ట్ చలపతిపై రూ.1 కోటి రివార్డ్
- 2016 వరకు పోలీసులకు లభించని చలపతి ఫొటోలు
- మావోయిస్ట్ ఆజాద్ మృతితో అతని ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- ఆజాద్ ఫోన్‌లో భార్యతో సెల్ఫీ దిగిన చలపతిని గుర్తించిన పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఛత్తీస్‌గఢ్–ఒడిశా సరిహద్దుల్లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 20 మంది వరకు మావోయిస్టులు మృతి చెందారు. కేంద్ర, రాష్ట్ర పోలీసులు జరిపిన సంయుక్త ఆపరేషన్‌లో మృతి చెందిన వారిలో సీనియర్ మావోయిస్ట్ లీడర్ జయరామ్ రెడ్డి అలియాస్ చలపతి ఉన్నాడు. చలపతి దశాబ్దాలుగా పోలీసుల నుంచి తప్పించుకుంటున్నాడు. కానీ తన భార్య అరుణ అలియాస్ చైతన్య వెంకట్ రవితో అతను దిగిన సెల్ఫీ అతని ప్రాణాల మీదకు తెచ్చింది. 2008 ఫిబ్రవరిలో ఒడిశాలోని నయాగఢ్ జిల్లాలో జరిగిన దాడిలో 13 మంది పోలీసులు మృతి చెందారు. ఈ ఘటన మాస్టర్ మైండ్ చలపతిగా గుర్తించిన పోలీసులు అతని తలపై రూ. 1 కోటి రివార్డ్ ప్రకటించారు. అయితే చలపతి ఎలా ఉంటాడో చాలా రోజుల వరకు బయటకు తెలియరాలేదు. 2016 వరకు అతని ఫొటోలు పోలీసులకు లభించలేదు.

చలపతి భార్య అరుణ కూడా మావోయిస్ట్. అరుణ ఆంధ్ర–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ డిప్యూటీ కమాండర్‌గా పని చేసింది. ఆ సమయంలో తన భర్తతో సెల్ఫీ తీసుకుంది. ఈ సెల్ఫీయే చలపతి రూపురేఖలను గుర్తించడంలో పోలీసులకు సహాయపడింది.

అరుణ తన భర్త చలపతితో దిగిన సెల్ఫీని సోదరుడైన ఆజాద్‌కు పంపించింది. 2016లో ఏపీలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ ఆజాద్ చనిపోయాడు. ఆజాద్ స్మార్ట్ ఫోన్ పోలీసుల చేతికి చిక్కింది. అప్పుడే చలపతి ఎలా ఉంటాడనే విషయం తెలిసింది. పోలీసులు అతని తలకు రూ. 1 కోటి రివార్డును ప్రకటించారు.

చలపతి చిత్తూరు వాసి. మావోయిస్ట్ సెంట్రల్ కమిటీలో సీనియర్ సభ్యుడు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో అతను చురుగ్గా ఉండేవాడు. ఆ ప్రాంతంలో ఎన్‌కౌంటర్లు పెరుగుతుండటంతో కొన్ని నెలల క్రితం తన స్థావరాన్ని మార్చుకున్నాడు. అతను ఒడిశా బార్డర్‌కు వచ్చాడు. చలపతి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తుంటాడని పోలీసులు గుర్తించారు.

# కుంభమేళా... మంత్రులతో పాటు పుణ్యస్నానాలు ఆచరించిన యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

- గంగమ్మ తల్లికి ప్రత్యేక హారతి ఇచ్చిన సీఎం యోగి ఆదిత్యనాథ్
- కుంభమేళాకు హాజరైన రాజ్యసభ ఎంపీ సుధామూర్తి
- ఇస్కాన్ క్యాంప్‌లో భక్తులకు మహాప్రసాదం వడ్డించిన సుధామూర్తి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య సహా 54 మంది రాష్ట్ర మంత్రులు మహా కుంభమేళా నేపథ్యంలో త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రపంచవ్యాప్తంగా భక్తకోటి తరలి వస్తోంది. 45 రోజుల పాటు జరగనున్న ఈ కుంభమేళాలో ప్రతిరోజు కోటి మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. మంత్రులతో కలిసి సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఈరోజు పుణ్యస్నానాలు ఆచరించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక హారతి ఇచ్చారు. జనవరి 13న ప్రారంభమైన కుంభమేళా ఫిబ్రవరి 26న ముగియనుంది.

**మహాప్రసాదం వడ్డించిన సుధామూర్తి**

రాజ్యసభ ఎంపీ సుధామూర్తి ప్రయాగ్ రాజ్ కుంభమేళాలో భక్తులకు మహాప్రసాదాన్ని వడ్డించారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆమె ప్రయాగ్ రాజ్ చేరుకున్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. ఆ తర్వాత స్థానిక ఇస్కాన్ క్యాంప్‌ను సందర్శించి భక్తులకు స్వయంగా మహాప్రసాదాన్ని వడ్డించారు. సుధామూర్తి తొలుత ఇస్కాన్ వంటశాలకు వెళ్లి అక్కడి వాలంటీర్లతో మాట్లాడారు. మెషీన్లతో భోజన తయారీని అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత కౌంటర్ వద్ద నిలబడి కుంభమేళాకు వచ్చిన భక్తులకు చపాతి, భోజనం వడ్డించారు. ఈ కుంభమేళాను ఆమె తీర్థరాజ్‌గా అభివర్ణించారు.

# అందరూ చూస్తుండగా పొడిచేశాడు... హనుమకొండలో నడిరోడ్డుపై ఆటోడ్రైవర్ హత్య!



**హైదరాబాద్ పెన్ పవర్:** హనుమకొండలో దారుణం జరిగింది. అదాలత్ సెంటర్ వద్ద పట్టపగలే ఆటోడ్రైవర్‌ను మరో ఆటో డ్రైవర్ అందరూ చూస్తుండగా కత్తితో పొడిచి చంపేశాడు. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని డీమార్ట్ ఎదురుగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఆటోడ్రైవర్లు మాచర్ల రాజ్ కుమార్, వెంకటేశ్వర్లు కత్తులతో దాడి చేసుకున్నారు. వీరిలో రాజ్‌కుమార్ చనిపోయాడు. మృతుడిది మడికొండ అని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఈ హత్యకు గత కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఈ హత్యకు ప్రేమ వ్యవహారమే కారణం కావొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దాడి చేసిన వెంకటేశ్వర్లును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# కర్ణాటక బీజేపీలో కుమ్ములాట... గాలి జనార్దన్ రెడ్డి, శ్రీరాములు మధ్య రగడ

**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటక బీజేపీలో అంతర్గత కుమ్ములాట మరింత ముదిరింది. మైనింగ్ కింగ్, ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి... మాజీ మంత్రి శ్రీరాములు మధ్య కలహాలు తీవ్రరూపు దాల్చాయి. తన రాజకీయ జీవితానికి అంతం పలికేందుకు గాలి జనార్దన్ రెడ్డి కుట్రలు చేస్తున్నారంటూ శ్రీరాములు ఆరోపిస్తున్నారు. పార్టీ నుంచి తప్పుకునేందుకైనా తాను సిద్ధమని ఆయన స్పష్టం చేశారు.

"గాలి జనార్దన్ రెడ్డి నాపై బీజేపీ రాష్ట్ర నాయకత్వాన్ని ఉసిగొల్పుతున్నారు. జనార్దన్ రెడ్డి ఒక నియంతలా వ్యవహరిస్తున్నారు. తన స్వార్థ ప్రయోజనాలకు అనుగుణంగా పార్టీ నాయకత్వం నడిచేలా పావులు కదుపుతున్నారు. నేను గత మూడు దశాబ్దాలుగా బీజేపీ విధేయుడిగా ఉన్నాను. ఎప్పుడూ పార్టీకి ద్రోహం తలపెట్టలేదు" అని స్పష్టం చేశారు.

శ్రీరాములు తాజాగా మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ కర్ణాటక వ్యవహారాల ఇన్చార్జి రాధామోహన్ అగర్వాల్ పైనా తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల రాష్ట్ర బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో అగర్వాల్ తనను అవమానానికి గురిచేశాడని శ్రీరాములు మండిపడ్డారు. "సందూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమికి నేనే కారణమని అగర్వాల్ నిందించారు. బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత కోసం నేను పనిచేయలేదని ఆయన ఆరోపణలు చేశారు. నా కారణంగానే పార్టీ ఓడిపోయిందని అభాండాలు వేశారు. ఈ వ్యవహారంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మౌనం వీడాలని కోరుకుంటున్నా. సందూర్ నియోజకవర్గంలో నేను ఎంతో చురుగ్గా ప్రచారం చేశానని విజయేంద్రకు తెలుసు" అని శ్రీరాములు వివరించారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ... వి.ప్రకాశ్‌ను ప్రశ్నించిన కమిషన్

- కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- 101వ సాక్షిగా ప్రకాశ్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేసిన కమిషన్
- తుమ్మిడిహట్టి నుంచి కాళేశ్వరంకు సైట్ మార్పుపై కమిషన్ ప్రశ్నించిందన్న ప్రకాశ్



**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట తెలంగాణ రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ హాజరయ్యారు. కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధిం చిన అంశాలపై కమిషన్ ఆయనను ప్రశ్నించింది. విచారణ అనంతరం వి.ప్రకాశ్ మీడియాతో మాట్లాడారు.ఈ కేసులో 101వ సాక్షిగా తన స్టేట్‌మెంట్‌ను కమిషన్ రికార్డ్ చేసుకుందన్నారు. తన వద్ద సమాచారం ఉందని గతంలో తానూ కమిషన్‌కు ఓ స్టేట్‌మెంట్, ఓ నోట్ సమర్పించానన్నారు. వాటి ఆధారంగా కమిషన్ తనను క్రాస్ ఎగ్జామిన్ చేసిందన్నారు. వీటిలో కొన్ని అంశాలపై తన వివరణ తీసుకున్నారని తెలిపారు.తుమ్మిడిహట్టి నుంచి కాళేశ్వరంకు సైట్‌ను ఎందుకు మార్చవలసి వచ్చింది? దానిని సమర్థిస్తున్నారా? అంటూ పలు ప్రశ్నలు వేసినట్లు చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని, బ్యారేజీ ఎత్తును తగ్గించాలని మహారాష్ట్ర అభ్యంతరం తెలిపిందని వెల్లడించారు. అందుకే మార్చినట్లు చెప్పారు.మేడిగడ్డ వద్ద ఆనకట్ట వద్దని ఇంజినీర్ల కమిటీ చెప్పింది కదా? అని కమిషన్ ప్రశ్నించిందని, కానీ రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ అలా చెప్పలేదని ఆయన తెలిపారు. బొగ్గు గనుల వద్ద సొరంగాలు వద్దన్న సిఫార్సులను నాటి ప్రభుత్వం గౌరవించినట్లు చెప్పారు. నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకొని కాళేశ్వరంను నిర్మించినట్లు చెప్పారు. తాము రికార్డులు, డాక్యుమెంట్ల ఆధారంగా పనిచేస్తామన్నారు.

# మహాకుంభ మేళా అంతరిక్షం నుంచి ఎలా కనిపిస్తుందంటే.. ఫొటోలు రిలీజ్ చేసిన ఇస్రో

- ప్రయాగ్ రాజ్ లో భారీ ఎత్తున్న నిర్మాణాలు చేపట్టినట్లు చిత్రాల్లో వెల్లడి
- గతేడాది ఏప్రిల్ లో ఖాళీగా కనిపించిన ప్రాంతంలో డిసెంబర్ లో వెలసిన టెంట్లు
- ఈ ఏడాది జనవరిలో భారీగా పెరిగిన నిర్మాణాలు




**హైదరాబాద్ పెన్ పవర్:**పన్నెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాకుంభమేళాకు జనం పోటెత్తుతున్నారు. 45 రోజుల పాటు జరిగే కుంభమేళాలో దాదాపు 40 కోట్ల మంది పాల్గొంటారని అధికారుల అంచనా. ఇందు కోసం ఉత్తరప్రదేశ్ సర్కారు భారీ ఎత్తున్న ఏర్పాట్లు చేసింది. టెంట్ సిటీని నిర్మించి భక్తులకు వసతి సదుపాయం కల్పించింది. సాధువుల నుంచి సామాన్యుల దాకా టెంట్లలో ఉంటున్నారు.

వీటితో పాటు భక్తుల కోసం ప్రభుత్వం ఇతరత్రా ఏర్పాట్లు చేసింది. వీటన్నింటికోసం చేపట్టిన నిర్మాణాలతో మహాకుంభ్ నగర్ ఓ భారీ నగరాన్ని తలపిస్తోంది. మహాకుంభమేళాకు సంబంధించి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) తాజాగా పలు చిత్రాలను విడుదల చేసింది. అంతరిక్షం నుంచి కుంభమేళా ఏరియాను ఉపగ్రహాలు తీసిన ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.ఈ ఫొటోల ప్రకారం.. గతేడాది ఏప్రిల్ లో ఈ ఏరియా నిర్మానుష్యంగా, బీడు భూములను తలపించేలా కనిపించింది. డిసెంబర్ 22న తీసిన ఫొటోలలో ఈ ప్రాంతంలో నిర్మాణాలు ప్రత్యక్షమయ్యాయి. టెంట్ల నిర్మాణం గత డిసెంబర్ లోనే మొదలైంది. తాత్కాలికంగా శివాలయ పార్కును కూడా అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో భారతదేశ పటం కనిపించడం విశేషం. ఈ నెల 10న తీసిన ఫొటోలలో మహాకుంభ్ నగర్ లో నిర్మాణాలు

భారీగా పెరిగిపోవడం చూడొచ్చు.మూడు రోజుల్లో కుంభమేళా ప్రారంభం కానున్న నేపథ్యంలో జనవరి 10 నాటికే సాధువులతో పాటు సామాన్యులు పెద్ద సంఖ్యలో త్రివేణీ సంగమం వద్దకు చేరుకున్నారు. కాగా, మహాకుంభ్ నగర్ లో దాదాపు 1.50 లక్షల టెంట్లను నిర్మించామని, అందులో 3 వేల కిచెన్ లు, అదనంగా 1.45 లక్షల రెస్ట్ రూంలు, 99 పార్కింగ్ లాట్లను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

# ఆత్మీయ భరోసా తొమ్మిది మందికేనా..?



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి అందించాలని సదుద్దేశంతో పక్క ప్రణాళికతో ముందుకు కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాలలో అర్హులను గుర్తించాలని వారికి పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్థానిక ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సైతం ఆదేశాలు సైతం జారీ చేసింది. కానీ అధికారులు చేస్తున్న పనుల వల్ల ప్రభుత్వం సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. వివరాల్లోకెళితే కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా నాలుగు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు సంబంధించి గ్రామసభలలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల యొక్క పేర్లను ప్రజల ముందు చదివి వినిపిస్తుంది. లిస్టులో పేరు రాని వాళ్ళు మరలా దరఖాస్తు చేసుకోవాలని పదేపదే అధికారులు సైతం చెబుతున్నారు. కానీ మండలంలోని కొత్త గోల్ తండాలో మాత్రం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లిస్టులో గ్రామంలో 300 నుండి 400 వరకు జాబు కార్డులో ఉన్న అనేకమంది దరఖాస్తులు చేసుకున్న కేవలం 9 మంది పేర్లు మాత్రమే వచ్చాయని అధికారులు చెప్పడంతో ఒకసారిగా గ్రామంలో ప్రజల విస్మయానికి గురయ్యారు. వందల సంఖ్యలో ఉపాధి హామీ పనిచేసే వారు ఉంటే కేవలం 9 పేర్లు రావడమే ఏమిటా అని ఆశ్చర్యానికి గురవుతున్నారు. 9 మందిలో కూడా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుటుంబానికి సంబంధించి ఐదుగురు పేర్లు వారి బంధువుల పేర్లు నలుగురు వచ్చాయని ఇదెక్కడి చోద్యమంటూ చెవులు కోరుకుంటున్నారు. అధికారులు మాత్రం గ్రామస్తులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తప్పనిసరిగా పేర్లు వస్తాయంటూ మాట దాటవేస్తున్నారు.

# గుండెపోటుకు గురైన పద్మారావుగౌడ్‌ను పరామర్శించిన కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్ ఎమ్మెల్యే, పార్టీ నేత పద్మారావు గౌడ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు.

ఈరోజు నగరంలోని పద్మారావు గౌడ్ ఇంటికి కేటీఆర్ వెళ్లారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు ఉన్నారు.పద్మారావు గౌడ్ తన కుటుంబంతో సహా ఉత్తరాఖండ్ పర్యటనలో ఉన్న సమయంలో డెహ్రాడూన్‌లో గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడి ఆసుపత్రికి తరలించారు. స్టంట్ వేసిన వైద్యులు ఎలాంటి ప్రాణాపాయం లేదని చెప్పారు. అక్కడ చికిత్స అనంతరం పద్మారావు గౌడ్ హైదరాబాద్ చేరుకున్నారు.

## హైటెక్ సిటీలోని కొత్త క్యాంపస్‌ను ప్రారంభించాలని రేవంత్ రెడ్డిని కోరిన హెచ్‌సీఎల్ టెక్ సీఈవో

- దావోస్‌లో రేవంత్ రెడ్డితో హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో భేటీ
- హైటెక్ సిటీలో కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తోన్న హెచ్‌సీఎల్ టెక్
- ఫిబ్రవరిలో దీనిని ప్రారంభించాలని సీఎంను కోరిన గ్లోబల్ సీఈవో




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో నిర్మిస్తోన్న తమ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టెక్ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్ గ్లోబల్ సీఈవో, ఎండీ విజయ్ కుమార్ కోరారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎంతో ఆయన భేటీ అయ్యారు. ఈ భేటీలో మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు పాల్గొన్నారు. హైటెక్ సిటీలో 3.2 లక్షల చదరపు అడుగుల్లో హెచ్‌సీఎల్ టెక్ క్యాంపస్‌ను నిర్వహిస్తోంది. ఈ కొత్త క్యాంపస్ నిర్మాణంతో 5 వేల మంది ఐటీ నిపుణులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ క్రమంలో ఫిబ్రవరిలో దీనిని ప్రారంభించాలని సీఎంను వారు కోరారు. తెలంగాణలో హెచ్‌సీఎల్ టెక్ సంస్థ తన సేవలను విస్తరించడాన్ని సీఎం స్వాగతించారు.

**తెలంగాణలో 'కంట్రోల్ ఎస్' భారీ పెట్టుబడి**

హైదరాబాద్‌లో రూ.10 వేల కోట్ల భారీ పెట్టుబడికి 'కంట్రోల్ ఎస్' ముందుకు వచ్చింది. 400 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూ కుదిరింది. దీంతో తెలంగాణలో 3,600 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశముంది. మంత్రి శ్రీధర్ బాబు, 'కంట్రోల్ ఎస్' సీఈవో శ్రీధర్ సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ డేటా సెంటర్ రాష్ట్రంలో మరో మైలురాయి కానుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

## అల్లు అర్జున్ అరెస్ట్‌పై మరోసారి స్పందించిన రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో సినీ నటుడు అల్లు అర్జున్‌పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి స్పందించారు. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం... ఓ ఆంగ్ల మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. తొక్కిసలాట ఘటనకు అల్లు అర్జున్ నేరుగా బాధ్యుడు కాదు కదా? అని మీడియా ప్రతినిధి ప్రశ్నించారు.
దీనికి సీఎం స్పందిస్తూ... రెండు రోజుల ముందు అనుమతి కోసం వస్తే పోలీసులు నిరాకరించారని, అయినా అల్లు అర్జున్ థియేటర్ వద్దకు వచ్చారని తెలిపారు. ఈ క్రమంలో అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారని, దీంతో సెక్యూరిటీ సిబ్బంది వారిని పక్కకు తోసేశారన్నారు. ఈ తొక్కిసలాటలో ఒకరు చనిపోయినట్లు చెప్పారు. ఒక మనిషి చనిపోవడం అనేది ఆయన (అల్లు అర్జున్) చేతుల్లో లేకపోవచ్చు కానీ... ఆ మహిళ కుటుంబాన్ని పది పన్నెండు రోజులు పట్టించుకోలేదన్నారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.
అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం మంచిది కాదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు కదా? అని మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సమాధానమిస్తూ... అల్లు అర్జున్‌ను ఎందుకు అరెస్ట్ చేశామో చంద్రబాబుకు పూర్తిగా తెలిసి ఉండకపోవచ్చన్నారు.

## గ్రామసభల్లో ఆందోళనలు.. అధికారుల తీరుపై జనం ఆగ్రహం




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల కోసం గ్రామసభల్లో అప్లికేషన్లు పెట్టుకుంటున్నారు గ్రామస్థులు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లోని గ్రామసభల్లో ప్రజలు ఆందోళనకు దిగుతున్నారు గ్రామస్థులు. లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయంటూ ఆరోపిస్తున్నారు. జగిత్యాల జిల్లాలోని పలు గ్రామాల్లో జరుగుతోన్న గ్రామసభల్లో ఆందోళనకు దిగుతున్నారు ప్రజలు. లబ్ధిదారుల ఎంపిక తీరుపై అధికారులను గ్రామ పెద్దలను ప్రశ్నిస్తున్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. ప్రజాపాలన దరఖాస్తులకు విలువ ఇవ్వలేదని ప్రజల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. పూర్తి సర్వే అనంతరమే లబ్ధిదారుల వివరాలు వెల్లడించాలని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. జగిత్యాల అర్బన్ మండలం థరూర్, రూరల్ మండలం మోరపెల్లి గ్రామంలోనూ ఉద్రిక్తత నెలకొంది. ప్రజాపాలన గ్రామసభలో అధికారులను అడ్డుకున్నారు గ్రామస్థులు. మొరపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట డబ్బులు వసూలు చేశారని ఆందోళనకు దిగారు. మొరపల్లిలో రహదారిపై బైఠాయించి గ్రామస్థుల ఆందోళనకు దిగారు. 500 మందికిపైగా గ్రామస్థుల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆందోళనకు దిగారు. దీంతో ఆందోళన కొనసాగుతోంది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం రేపాల గ్రామంలో 2 వ రోజు నిర్వహించిన గ్రామసభలో అధికారులతో వాగ్వాదానికి దిగారు గ్రామస్తులు. రేషన్ కార్డ్ ఇతర పథకాల జాబితాలో తమ పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకెన్ని సార్లు అప్లికేషన్ పెట్టుకోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఖైరతాబాద్‌లో కూల్చివేతలను అడ్డుకున్న దానం నాగేందర్... అధికారులపై ఆగ్రహం

- షాదాన్ కాలేజీ ఎదుట ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కూల్చివేత చేపట్టిన అధికారులు
- కూల్చివేతలను సంయుక్తంగా చేపట్టిన బల్దియా, ట్రాఫిక్ పోలీసులు
- తనకు సమాచారం ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని దానం నాగేందర్ ఆగ్రహం
- సీఎం రేవంత్ రెడ్డి వచ్చే వరకు వేచి చూడాలని స్పష్టీకరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఆక్రమణల కూల్చివేతలను స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అడ్డుకున్నారు. బల్దియా, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ఖైరతాబాద్‌లోని షాదాన్ కాలేజీ ఎదురుగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కూల్చివేతలు చేపట్టారు. ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే దానం నాగేందర్ అక్కడకు చేరుకున్నారు. కూల్చివేతలను వెంటనే ఆపాలని అధికారులను కోరారు. తాను స్థానిక ఎమ్మెల్యేనని, తనకు సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలు ఎలా చేపడతారని అధికారులను ప్రశ్నించారు. పొట్టకూటి కోసం జీవనం సాగిస్తున్న పేదవారిపై దౌర్జన్యం ఏమిటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనలో ఉన్నారని, ఆయన వచ్చే వరకు కూల్చివేతలు ఆపాలన్నారు. కూల్చివేతలు ఆపకుంటే మాత్రం ఆందోళన చేస్తానని హెచ్చరించారు.

## భార్యను ముక్కలుగా నరికి కుక్కర్‌లో ఉడకపెట్టిన భర్త

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ పరిధిలోని మీర్‌పేట్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త.. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా కోసి కుక్కర్‌లో ఉడకపెట్టాడు. చివరగా ఆ మాంసం ముద్దలను ఎండబెట్టి.. పొడిగా మార్చి నగర శివారులోని జిల్లెలగూడ చెరువులో పడేశాడు. వింటేనే ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రకాశం జిల్లా, జేపీ చెరువుకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి గురుమూర్తి ప్రస్తుతం డీఆర్డీవో(%ణ=ణూ%)లో ఔట్సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈయన భార్య వెంకట మాధవి(35), ఇద్దరు పిల్లలతో కలిసి జిల్లెల్లగూడ పరిధిలోని న్యూ వెంకటేశ్వర నగర్ కాలనీలో నివాసముంటున్నాడు. భార్యపై అనుమానం పెంచుకున్న గురుమూర్తి ఆమెను హంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే సంక్రాంతి పండగ రావడంతో.. 




పిల్లలను ఊరికి పంపించి పక్కా ప్లాన్ ప్రకారం భార్యను హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ముక్కలుగా కోసి శరీర భాగాలన్నింటిని నాలుగైదు దఫాలుగా కుక్కర్‌లో ఉడకపెట్టాడు. అంతటిలో ఆగకుండా ఆ మానవ మాంసాన్ని.. ఇంట్లోనే ఎండబెట్టి పొడిగా మార్చాడు. చివరగా ఆ పొడిని తీసుకుపోయి నగర శివారులోని జిల్లెలగూడ చెరువులో పడేశాడు. వెంకట మాధవి నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ లేకపోవడంతో.. అనుమానమొచ్చిన తల్లిదండ్రులు ఈనెల 13న కుమార్తె కనిపించడం లేదని మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో గురుమూర్తి వారి వెంటే ఉన్నారు. తనకు ఏం తెలియదు అన్నట్టుగా అత్తమామలతో కలిసి మీర్‌పేట్ పీఎస్‌కు వచ్చాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు స్థానికులను విచారించగా.. భార్యాభర్తల మధ్య పదే పదే గొడవలు జరుగుతున్న విషయం బయటకు వచ్చింది. అనుమానంతో పోలీసులు గురుమూర్తిని అదుపులోకి విచారించగా.. చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. ఇక్కడ మరో విషయం ఏమిటంటే.. భార్యను చంపడానికి ముందు గురుమూర్తి ట్రయల్ కోసం ఒక కుక్కను చంపి ముక్కలుగా నరికిన ఉడకబెట్టడాని తెలుస్తోంది. ప్రస్తుతం పోలీసులు వెంకట మాధవి శరీర పొడిని సేకరించే పనిలో పడ్డారు. పొడి చెరువు నీటిలో కలిసిపోయి ఉంటుంది కనుక సేకరించడం కాస్త కష్టమే.

# అసమర్ధ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి





- గులాబీ జెండా కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- బిఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు పార్టీ శ్రేణులు నూతన ఉత్సాహంతో పని చేయాలి
- మళ్లీ ప్రభుత్వం రాదేమోనని అందిన కాడికి కాంగ్రెస్ నాయకులు దోచుకుంటున్నారు
- ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ అండగా ఉంటుంది
- పోరాటాలు బి ఆర్ ఎస్ కు కొత్తేమీ కాదు తప్పుడు కేసులకు భయపడేది లేదు
- తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీకే భవిష్యత్తు
- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**హైదరాబాద్ పెన్ పవర్:** మాయ మాటలతో ప్రజలను మోసం చేసి అమలకు నోచుకోని హామీలను ఇచ్చిన అసమర్ధ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం గుడిబండ లోని మాజీ ఎంపీపీ చింతా కవిత రాదారెడ్డి నివాసంలో కోదాడ బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన మండల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గులాబీ జెండా కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని రాష్ట్రంలో భవిష్యత్తు ఉన్న పార్టీ తమదేనని మరల అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతి గడప,గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ప్రజల కోసం నిరంతరం పనిచేశామని ఏడాది కాంగ్రెస్ పాలనలో ఏం కోల్పోయమో ప్రజలందరికీ తెలిసి వచ్చిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి సంక్షేమ పథకాలు కెసిఆర్ చేసి చూపించారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో గులాబీ జెండా ఎగరవేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు మరల తాము అధికారంలోకి రాలేమని పై నుంచి కింది స్థాయి వరకు ఎవరికి తోచినంత వారు దోచుకుంటున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తమ పార్టీ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి సాగిస్తున్న పాలనను గడపగడపకు తీసుకువెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. పోరాటాలు బి ఆర్ ఎస్ కు కొత్తేమీ కాదని పోలీస్ కేసులకు భయపడేది లేదన్నారు. మరలా పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ చింతా కవిత రాదారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ కోదాడ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు, మండలం కో ఆప్షన్ సభ్యులు షేక్ ఉద్దండు, మాజీ %జూఖఎం% చైర్మన్ రమేష్, మాజీ సర్పంచ్ దొంగరి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ గంటా శ్రీను,దొంతగాని అప్పారావు,నారాయణ రావు, అన్నెం వెంకట్ రెడ్డి, కోటి రెడ్డి,బోసుబాబు, వరధా రావు మాజీ సర్పంచులు గ్రామాశాఖ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి



- భూక్యా రమేష్ డిమాండ్
- అధికారులను నిలదీసిన సీపీఎం నేతలు.
- 35 వార్డులో ప్రజా ప్రతినిధులపై అధికారులపై తిరగబడ్డ ప్రజలు
- పోలీసులతో నడిచిన ఇందిరమ్మ సభ

**హైదరాబాద్ పెన్ పవర్:** స్థానిక 35వ వార్డులో ప్రారంభమైన ఇందిరమ్మ ఇండ్ల ప్రజలకు కేటాయింపుల అవకతవకలు జరిగాయని ఉన్నవారికి ఇల్లు వచ్చాయని లేనివారికి అర్హత ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని వెంటనే విచారణ జరిపి అర్హులైన వారికి కేటాయించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ అధికారులను డిమాండ్ చేశారు. కొత్తగూడెం పట్టణంలో 35 వార్డులో బుధవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇల్లు తదితర సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని దరఖాస్తుదారులకు జాబుతారీతనంగా రసీదులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలు అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకున్న సంక్షేమ పథకాలు వారికి దక్కుతాయన్న ఆశతో వేయికళ్లతో ఎదురుచూస్తున్న ఇందిరమ్మ సభలో అర్హులైన పేదలకు నిరాశ మిగిలిందని అక్రమాలు చోటు చేసుకున్న నేపథ్యంలో విచారణ చేపట్టాలని భూక్యా రమేష్ సూచించారు. ఇందిరమ్మ ఇల్లు కేటాయింపులో పారదర్శకత లోపించిందని అర్హులైన వారికి కాకుండా అనర్హులకు కూడా ఇందిరమ ఇండ్లు మంజూరు అయ్యాయని అర్హత కలిగిన వారికి రేషన్ కార్డులు రాలేదని రేషన్ కార్డులలో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు కాలేదని ఇందిరమ్మ ఇల్లు దరఖాస్తు చేసుకోవాలంటే రిజిస్ట్రేషన్ పట్టా ఉండాలని పట్టా లేకుంటే ఇందిరమ్మ ఇండ్లు రాదని అనేక సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని వాటికి సరైన సమాధానం ఇవ్వలేక అధికారుల వద్ద స్పష్టత లేకపోవడం వల్ల ఇందిరమ్మ సభ అంతా గందరగోళంగా మారి స్పష్టత లోపించిందని భూక్య రమేష్ విమర్శించారు.

నిజమైన లబ్ధిదారులకు ఇండ్లు రాకపోతే వెంటనే విచారణ చేపడతామని రానివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రవీందర్ సిపిఎం నేతలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఎం నాయకులు ఎన్ ఎస్ రాజు, హరి, గిరి ప్రసాద్, బన్సీలాల్, సునీల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇదేనా ప్రజాపాలనా?

**హైదరాబాద్ పెన్ పవర్:** పోలీసుల పహారా మధ్య గ్రామ సభలు ఎందుకు నిర్వహిస్తున్నారని...? ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా ఎందుకు వ్యవహరిస్తున్నారని..ఇదేనా ప్రజాపాలన అంటూ బిజెపి లక్ష్మిదేవిపల్లి మండల బీజేపి అధ్యక్షులు మాలోత్ గాంధీ నాయక్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రారంభమైన గ్రామ సభల తీరు బాగోలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రులు పాలన గాలికి వదిలేసి విదేశాల్లో తిరుగుతుంటే గ్రామ సభలు పోలీసుల కనుసన్నల్లో జరపడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలపై నిలదీస్తున్న ప్రజలను ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు భయ భ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గ్రామ సభల్లో పాల్గొన్న అధికారులను కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తూ నోటి కొచ్చినట్లు తిడుతున్నారని అది బాధాకరమన్నారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో సిపిఐ, కాంగ్రెస్ నాయకులకే పెద్దపీట వేస్తున్నారంటూ జనం ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిలదీస్తున్నారన్నారు. గ్రామ సభల్లో ప్రజల వ్యతిరేకత చూశాక ప్రభుత్వంపై ఎంత ఆగ్రహంగా ఉన్నారో తేటతెల్లమైందన్నారు. ఆరు హామీల్లో రైతు రుణమాఫీ ఇప్పటికీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. అమలు చేయనప్పుడు హామీలు ఇవ్వడం ఎందుకని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ పథకం పెట్టిన అందులో లాబింగ్ లే ఉంటాయి తప్ప ప్రజలకు న్యాయం జరగదని ఇద్దేవా చేశారు. రేషన్ కార్డు ఇవ్వడానికి కూడా ఇబ్బంది ఎందుకు పేదలకు బియ్యం కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇండ్లు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ఇబ్బంది పడుతుందన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పగడ్బందీ చర్యలు తీసుకోవాలని మాలోత్ గాంధీ నాయక్ డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల సంక్షేమ పథకాల అమలులో భాగంగా నిర్వహించు గ్రామసభలలో రెండవ రోజు బుధవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్నారు. గ్రామసభ తీరు దరఖాస్తు ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి గ్రామపంచాయతీ సెక్రటరీ నాలుగు సంక్షేమ పథకాల అర్హుల జాబితాను సభకు చదివి వినిపించారు. అర్హుల జాబితాలో వచ్చిన అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయి అన్నారు. ప్రజల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ గ్రామ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. అర్హులకు జాబితాలో పేరు రానివారు ఆందోళన చేయాల్సిన అవసరం లేదని గ్రామ సభలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. గ్రామ సభల నిర్వహణ అర్హులను అనర్హులను గుర్తించడానికి అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించడానికి అని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు గ్రామ సభలలో కానీ ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలలో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పీవీ చలపతిరావు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గ్రామ పంచాయతీ సెక్రటరీ సంబంధిత అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలకు బీమా ధీమా

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీ తమ కార్యకర్తలకు అండగా ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ భరోసా ఇచ్చారు. బుధవారం మోతే మండలం నేరెడువాయి గ్రామానికి చెందిన కొచ్చర్ల శ్రీను కొచ్చర్ల బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక సభ్యత్వాన్ని పొందారు. శీను ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బీఆర్ఎస్ లో సభ్యత్వాన్ని పొందిన కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ బాసటగా నిలిచింది. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి అందిన రూ.2 లక్షల బీమా చెక్కును నామినీ భార్య కొచ్చర్ల రమణ కు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ నేరేడువాయి గ్రామంలో వారి ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఉద్యమ పార్టీ నుంచి ప్రస్థానం ప్రారంభించి రాజకీయ పార్టీగా మారిన బీఆర్ఎస్ పార్టీ తమ కార్యకర్తలందరికీ అండగా నిలుస్తుందని వారు భరోసా ఇచ్చారు. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్టం అభివృద్ధి పథంలో పయనించిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తలెవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందినట్లైతే నామినికీ రూ.2 లక్షల బీమా చెక్కును బీఆర్ఎస్ పార్టీ అందజేస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శీలం సైదులు , మాజీ ఎంపీపీ అరె లింగారెడ్డి, మండల నాయకులు నూకల శ్రీనివాస్ రెడ్డి, మిక్కిలినేని సతీష్, కండక్టర్ వెంకన్న, , మైనంపాటి శ్రీనివాస్ రెడ్డి,మండల యూత్ అధ్యక్షులు షాష, నాయకులు కుక్క బిక్షం, నరేష్ నాయక్, హనుమాన్ చారి, నరేష్, సతీష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఎం జె ఎఫ్ బలోపేతానికి కృషి చేయాలి



**హైదరాబాద్ పెన్ పవర్:**:ఎంజే ఎఫ్ బలోపేతానికి మాదిగ జర్నలిస్టుల కృషి చేయాలని ఎం జె ఎఫ్ రాష్ట్ర నాయకులు పడిశాల రఘు అన్నారు.

కోదాడ నియోజకవర్గ ఎం జె ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

కోదాడ పట్టణంలో స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో బుధవారం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి నాగరాజు అధ్యక్షతన ఎం జె ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మాదిగ జర్నలిస్టులపై దాడులకు దిగిన కులం పేరుతో దూషించిన అందరం ఒకే కలిసికట్టుగా న్యాయం జరిగే వరకు పోరాడాలని అన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలలో తప్పనిసరిగా మాదిగ జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

అనంతరం కోదాడ నియోజకవర్గ ఎం జె ఎఫ్ నూతన అధ్యక్షునిగా చెరుకుపల్లి శ్రీకాంత్ ఉపాధ్యక్షులుగా చీమ చంద్రశేఖర్, మాతంగి సురేష్, ప్రధాన కార్యదర్శి తమలపాకుల లక్ష్మీనారాయణ , కోశాధికారిగా మందుల రాంబాబు, సహాయ కార్యదర్శిగా ,కుడుముల శివ, ఎంజెఎఫ్ కోదాడ ప్రచార కమిటీ కార్యదర్శి ఏపూరి సునీల్ రత్నాకర్ ,ఉపాధ్యక్షులుగా కలకొండ బుచ్చి రాములు కార్యదర్శిగా నేలమర్రి శ్రీకాంత్ గౌరవ సలహాదారులుగా బంక వెంకటరత్నం ,తోళ్ల గురునాథం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా నూతన కమిటీకి రాష్ట్ర నాయకులు పడిశాల రఘు నియామక పత్రాలను అందజేశారు అనంతరం నూతన కమిటీని పూలమాల సాలువులతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఆళ్ళూరు చరణ్ , సుజన్ సుజిత్,సన్నీ డేవిడ్, తదితరులు పాల్గొన్నారు,

# అయ్యప్ప ఆలయాన్ని సందర్శించినా ఉమ్మడి నల్గొండ జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్,కే భాస్కర్



**హైదరాబాద్ పెన్ పవర్:**అనంతగిరి మండల కేంద్రంలో గుట్ట పైన వెలిసిన తెలంగాణ శబరిమల శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప ఆలయాన్ని ఉమ్మడి నల్గొండ జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్,కే భాస్కర్ సందర్శించి, ఆలయ నిర్మాణ విశిష్టత నీ అడిగి తెలుసుకొన్నారు, అదే విధంగా శాఖ పరిధిలోని శ్రీ రఘునాథ స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాలను సందర్శించడం జరిగింది, అదేవిధంగా అయ్యప్ప ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, అసిస్టెంట్ కమిషనర్ కే భాస్కర్ కి మర్యాదపూర్వకంగా బొకే ఇచ్చి శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ మాట్లాడుతూ అయ్యప్ప దేవాలయం అనంతగిరిలో ఇంత పెద్ద ఎత్తున గుట్టపైన కట్టటం చాలా గొప్ప విషయమని అదేవిధంగా ఈ దేవాలయంలో నిత్యం పూజలు జరుపుకుంటూ భక్తులు వేల సంఖ్యలలో పాల్గొని జాతర్లు జరుపుకునే విధంగా నడిపిస్తున్నందుకు నాకు ఆనందకరంగా ఉందని వారు అన్నారు రాబోవు రోజులలో ఈ దేవాలయం ఎంతో పేరు పొందుతుందని అన్నారు ఈ దేవాలయానికి నా వంతుగా ఏ పని చేయటానికైనా నేను సిద్ధంగా ఉన్నానని వారు ఆనందంతో తెలియజేశారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ తీగల నరసింహారావు,మాజీ సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు, కార్యనిర్వహణాధికారి తుమ్మల వెంకటాచలపతి, నాగెల్ల శంబిరెడ్డి, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, నరసింహారావు, ఆయా ఆలయాల అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు